# ★ నిజాయితీ ★

రచన: రాయప్రోలు బ్రహ్మానందశాస్త్రి

బందరు మెయిన్‌రోడ్డుమీద ఎప్పుడూ జనం అంతగా లేకపోయినా, సాయంత్రమయ్యేసరికి రోడ్డంతా చాలా రద్దీగా తయారవుతుంది. ఆఫీసులు వదిలిపెట్టంగానే వచ్చేజనం, చల్లగా ఉందికదా అని ఇళ్ళనుంచి బయల్దేరే వాళ్ళు, వీళ్లందర్నీ చూడటానికి వచ్చే స్టూడెంట్సు, నిజంగా పనిఉన్నవాళ్ళతో- మొత్తానికి ఆ సమయంలో ఉన్నంత జనం మరోప్పుడు ఉండరు. ఎక్కడైనా అంతేనేమో !

గోపాలం ఐదుగంటలకల్లా ఆఫీసునుంచి బయటపడి ఒక్కసారి హాయిగా గాలి పీల్చుకున్నాడు. ఇంటికెళ్ళేముందు ఒకసారి బజారంతా తిరగటం అతని దినచర్యలో ఒకభాగమైపోయింది. ఇదీ కాక ఏమైనా సరకులు కావాల్సివస్తే అవీ తీసుకెళ్ళచ్చు.

ఈ రోజుకూడా ఏవో కొన్ని కూరలు వగైరాలు కావాలి. ఏం ఏం కావాలో అతనికి సరిగ్గా గుర్తులేదు. ఎట్లా గుర్తుంటుంది ? కనుమరుగైయ్యేదాకా ఆవిడ ఏదో ఒకటి తెమ్మని పురమాయిస్తూనే ఉంటుందైరి !! మెల్లిగా నెమరువేసుకుంటున్నాడు వినిపించినవన్నీ - కూరలు అందులో ఏవో రకాలు - ఎన్ని చెప్పినా తనకు వీలుగా అనిపించినవి - అక్కడకెళ్లిం తర్వాత నిర్ణయించుకోవాల్సిందే తప్పితే ఇప్పుడే ఏమీ నిర్ధారణ చేసుకోవటానికి వీల్లేదు.- తీరా వెళ్ళింతర్వాత ఏదో కూర చౌకగా ఇవ్వచ్చు - మనం కావాలనుకున్నది అతిప్రియం చెప్పచ్చు అటువంటప్పుడు చౌకగా ఉన్నదే తీసుకోవాల్సి వస్తుంది. అందుకని వాటికని ఒకలిస్టు తయారుచేసి ఉంచుకోవటం అనవసరం. తర్వాత- కాఫీపొడి కావాలిట - ఏమిటో ఈ కాఫీ గుండతోనే ఇల్లు గుండం ఐపోతోంది. ప్రతివారానికీ కావాల్సిందే. కాఫీపొడికి ఎంత ఖర్చవుతుందో దానికి రెండింతలు ఖర్చవుతుంది పాలకీ - పంచదారకీ - తాగకుండా ఉండలేము - కాఫీలు మానితగాని కొంపలు బాగుపడవు మానదామనుకోవటమె గానీ ఎప్పుడూ క్రియాపూర్వకంగా చేసిందిలేదు - చేసినా సాగింది ఒంతకంలేదు. ఇంకా పిల్లాడికి మొలతాడు కావాలిట. ఇంకా ఏమేమిటో చెప్పింది కానీ అవేం పట్టించుకోదల్చుకోలేదు. గోపాలం - పైవి మూడూ అవసరమనుకున్నాడు అవి మూడు మాత్రం తప్పక తీస్కెళ్ళా మిరోజు అనుకున్నాడు.

ముందు కాఫీపొడి దుకాణం వస్తుంది అతని దారిలో - కాఫీపొడి ముందుకొంటే, తరవాత కూరలుకొంటూ కాఫీపొడిమీద వేస్తే పొట్లం చినిగిపోవటం మొదలైన న్యూసెన్సులన్నీ జరుగుతాయని అతనికి తెలుసు అనుభవపూర్వకంగా, కానీ కూరలకెళ్లి మళ్లా కాఫీపొడికోసం వెనక్కు రావటం బద్ధకం. అంచేత సామాన్యంగా పొడే ముందు కొనాల్సివస్తుంది.

'ఏమయ్యా మళ్ళీ అయిదుపైసలు పెంచావ్ ?' అన్నాడు గోపాలం. అప్పుడే ఆడించి తూచి ఇచ్చిన పొట్లాన్ని, నోటివ్వగా మిగిలిన చిల్లరని తీసుకుంటూ.

'మరేనండీ. ఇప్పుడు ఈ ఆడించిన గింజలు చాలా మేలుజాతివండీ...అందుకని...' ధర గురించి అడిగినప్పుడు షాపువాళ్లకి తప్పించుకోటం బాగా తెలుసు.

'అంటే, ఇంతకు ముందంతా మంచిగింజల పొడి ఇవ్వలేదా !' అన్నాడు గోపాలం, షాపువాడేమంటాడో అనే ఉద్దేశంతో.

'అబ్బెబ్బే - అదేం లేదండీ. నిన్ననే మంచి గుండుగింజలు వచ్చాయి ఇంతవరకూ అటువంటిగింజ మనఊరికే రాలేదు కావాలంటే ఎప్పుడూ ఇచ్చే పొడీఉంది...ఇస్తా' వాళ్ళకి కస్టమర్సుతో ఎట్లా మాట్లాడాలనేది వంటపట్టిస్తుంది తేలిగ్గా.

'గోపాలం పొట్లం సంచీలో వేసుకుని' సరే ! చూద్దాం. ఈ పొడి ఎట్లా ఉంటుందో అన్నాను వెళ్లిపోతూ.

'మళ్ళీ ఇదేపొడి కావాలంటారు చూడండి నా మాట అబద్ధమైతే' షాపువాడు నవ్వుతూ చెప్తున్నాడు గోపాలం వెళ్లిపోయినాకూడా.

తర్వాత గోపాలం కూరలమార్కెట్టుకు వెళ్ళాడు ఒక్కడా జరగాల్సినంత జరగడం జరిగాక ఏవో కూరలు కొన్ని కొని బయట బట్టాడూ అసంతృప్తిగా వాడేమో పైన ఉంటాడు. పుచ్చులు ఏరుకోవటానికి వీలుండదు. బేరమాట్టానికి అంతకంటే అవకాశం ఉండదు. ముదురుగా ఉందయ్యా సొరకాయంటే - కత్తితో పొడిచి చూడండి ఎంత లేతగావుందో అంటాడు. అటువంటివాళ్ళకి చెప్పేదేముంది?

బేరమాట్టానికి నేర్పుండాలి. అది గోపాలం లోకూన్యం.అందుకని గోపాలం సామాన్యంగా వస్తువులు కొన్నతర్వాత బాధపడుతూ ఉంటాడు. అతనిలాంటి వాళ్లు చేయదగ్గది అదే మరి. గోపాల్నాకి విజయవంతంగా బేరం చేసేవాళ్ళని చూస్తే, ఆశ్చర్యము, ఈర్ష్య కలుగుతాయి.

మార్కెట్టునిండి బయటకు వస్తూంటే పూలు కనిపించాయి. బేరం చేయటం అనేది ఎప్పుడో మానుకున్నాడు గోపాలం. అక్కడి పరిస్థితికూడా,- నిజమాలోచిస్తే అంతే. పూలు పైకి మాత్రం చక్కగా పేర్చుతాడు. ఎక్కడా అందని పండులాగా తను కూర్చుంటాడు. ఏదో తూకం - అందులో ఒకవైపు కొన్ని పూలు ఉంచుతాడు. ఆ పూలతో మనకిచ్చే పూలు తూస్తాడు. అది ఎంతతూకమో ఏమిటో వాళ్ళకే తెలియాలి. మనం ఇచ్చిన డబ్బులకి ఎన్నిపూలిస్తే, ఎటువంటి పూలిస్తే

(తరువాయి 22 వ పేజి)

## ★ నిజాయితీ ★

(7 వ పేజి తరువాయి)

అవే పట్టుకెళ్ళాలి ఏరి ఇవ్వటం అనేది జన్మలో ఎరుగరు వాళ్ళు.

ఓ బేడఇచ్చి పూలుపొట్లం తీసుకున్నాడు గోపాలం—

బైటికొచ్చింతర్వాత ఎదురుగుండానే తాళ్లు కర్రకి వేలాడదీసుకుని మొలతాళ్లవాడు కనిపించాడు ధర అడక్కుండానే — అణా — అణా అని అనుస్తున్నాడు. ఐనకూడా గోపాలం ఎంతేంట్యా – ఇది అన్నాడు ఒకతాడు పట్టుకుని.

'అణా బాబూ–' అన్నాడు వాడు

'ఎన్ని గజాలుంటుంది?' అన్నాడు గోపాలం తెలుసుకోకుండా కొంటంకానీ, బేరం చేయటంకానీ అవివేకం ఔతుందనే దృష్టితో.

'రెండు గజాలుంటాయండి' అన్నాడు వాడు.

'ఐదుపైసలకిస్తావా – రెండు తీసుకుంటాను...' అన్నాడు గోపాలం అంతకంటే తక్కువకి అడగటానికి మనస్కరించలేదు. రెండు తీసుకుంటున్నాను గనక బేరమాడినా ఫర్వాలేదనుకున్నాడు. చుట్టూ ఎవరైనా ఈ బేరాన్ని చూస్తున్నారేమోనని పరికించాడు. ఎవరిగొడవల్లో వాళ్ళు ఉన్నారు. పక్కనే వున్న లావుపాటాయన రాజకీయాలు తెగరించేస్తున్నాడు ఎవరితోనో,— ఎదురుగుండా ఉన్న ఓ యువకుడు పక్కనించే వయ్యారంగా వెళ్తున్న రెండుజడల అమ్మాయిని రెప్పవాల్చకుండా చూస్తూ నయనానందం కల్గించుకుంటున్నాడు. ఏ శైరుశ్శాకిద మామిడి కాయల్ని తెగబేరం చేసేస్తున్నది కుట్టటానికి చెప్పలిచ్చినాయన. చెప్పలుకూడ చెడకొట్టేస్తాడో, మార్చేస్తాడో అన్నంత ఆదుర్దాగా ఆ మాదిగవాడివంక చూస్తున్నాడు.

ఆ ప్రశ్న అడిగేసరికి తాళ్లవాడు. ఒకసారి విచిత్రంగా గోపాలంవంక చూశాడు. ఐనా కొనబోయేది గోపాలం కనక 'ఇందులో మాకు వచ్చేదే ఒక్కపైస బాబూ – మీరు షాపుల్లో కొత్తే గజం అణాచొప్పున అమ్ముతారండీ తెలిసినవారు మీరే బేరంచేస్తే ఎట్లా? ఏదో బీదవాడిని' అన్నాడు. గోపాలానికి ఏమీ తెలీదని వాడికి తెలీదు పాపం

గోపాలం మరి మాట్లాడలేకపోయాడు. రెండు తాళ్లియ్యమని చెప్పి జేబులోంచి అర్ధరూపాయి తీసి ఇచ్చాడు అప్పుడే మెల్లిగా చీకట్లు ముసురుకుంటున్నాయి.

తాళ్ళు ఇచ్చేస్తూ, చిల్లర ఇచ్చాడు తడువుకుంటూ. తొందరలో వాడు చిల్లర ఒకపావలా ఎక్కువ ఇచ్చాడు.

గోపాలం చూశాడు. పావలా ఎక్కువగా ఉంది. ఆ క్షణంలో అతనికి అనేకాలోచనలు వచ్చాయి 'పావలా తిరిగి ఇవ్వటమా ఇవ్వకపోవటమా? మరెవరైనా తన పరిస్థితిలో ఉంటే ఏంచేసి ఉండేవాళ్ళు? తను ఎన్నో మాట్లు ఎందరిదగ్గరో మోసపోయాడు. ఒకసారి రైల్లో సోడాలవాడు రూపాయినోటు పుచ్చుకుని రైలు కదిలేవరకూ కనపడలేదు. ఇంకోసారి ఎవడో సత్తుపావలా ఇచ్చాడు. మరోసారి చిల్లర తక్కువగా ఇచ్చినట్లు ఇంటికి వచ్చింతర్వాత గానీ తెలీలేదు. ఇంతమంది ఇన్నిరకాలుగా మోసం చేస్తున్నప్పుడు ఇప్పుడు తనీపావలా ఎందుకు తీసుకోకూడదు. తనేం దొంగతనం చేయటంలేదే! వాడి కర్మకొద్దీ నాకు ఎక్కువ ఇచ్చాడు. వాడికే ప్రాప్తంఉంటే ఇంకోళ్ళదగ్గర ఎక్కువ తీసుకుంటాడు. ఛ! ఛ! ఎక్కడో మోసపోయామని ఇప్పుడు వీణ్ణి ఇక్కడ మోసం చేయదేమిటమా. రోజుకి ముప్పావలో రూపాయో కష్టపడి సంపాదించే వాడిదగ్గర తను మోసం చేయటం అన్యాయం. వేలు సంపాదించే షాపుల్లో ఐతే ఫర్వాలేదు. వాడిదగ్గరచేస్తే పాపం చుట్టుకుంటుంది' ఈ విధంగా ఆలోచించుకుని గోపాలం 'ఏమయ్యోయ్! చూడు నయాపైసకి బదులు పావలాఇచ్చినట్టున్నావ్' అన్నాడు వాడి చింకిబట్టలవంక చూస్తూ.

వాడు గతుక్కుమన్నాడు. పావలా తీసుకుని నయాపైస ఇచ్చేస్తూ 'బాబుగారూ తమరి రూపాయి నోటు కిందపడిపోయింది నూస్కోండి బాబయ్యా' అన్నాడు గోపాలం ఆశ్చర్యంగా వాడివంక చూస్తూ రూపాయి తీసుకున్నాడు. వాడి నిజాయితీని మెచ్చుకున్నాడు. అప్పుడు వాడు 'నాది బుద్ధితక్కువైనాది దొరా. తమబోటివారినే మోసం చేయాలనుకున్నాను. రూపాయి పడిపోవటం మొదటే చూశాను. మీరెళ్లిపోగానే అది తీసుకుందామనే తొందరలో మీకు ఎక్కువ చిల్లర ఇచ్చేసినా. మీరు ఎక్కువొచ్చిందాన్ని నాకు మళ్ళీ ఇచ్చేయగానే నాకు బుద్ధొచ్చింది దొరా. మిమ్మల్ని మోసం చేయకూడదని. నన్ను క్షమించు బాబయ్యా' అన్నాడు.

వాడికి గోపాలం నిజాయితీ పరుడుగా కనిపించినా గోపాలం అంతరాత్మకి తెలుసు ఆతను ఎటువంటివాడో!

చదవండి! చదవండి!!

★ సాధన ★

(మాస పత్రిక)

ప్రచురణ భారతీయ రచయితల సమితి

ఆంధ్ర ప్రదేశ్

విడిప్రతి 0-25 న.పై.

సాలుచందా రు3—00

అరండేల్‌పేట :: గుంటూరు-2

మాదిరి కాపీకై నేడే వ్రాయండి.